


# ఖరీదు

ఈ విషయం ముందే నీరజకి చెప్పగూడదు. హఠాత్తుగా పాకెట్టుని పట్టుకెళ్ళి ఆమె చేతిలో పెట్టి ఆనందంలో ముంచెత్తివేయాలి.

ఈ ఆలోచనతో సుధాకర్ తాను ఆ రోజు పట్టుచీర కొనుక్కొస్తున్నట్లు భార్యతో చెప్పలేదు.

నాణ్యమనిపించింది. ఆమె కట్టుకుంటే బావుంటుంది అని అనిపించింది. చీర నాల్గయిదు దుకాణాలు తిరిగిన తర్వాత కానీ కనిపించలేదు.

అప్పటికి బాగా చీకటి పడిపోయింది. తను పెట్టదల్చుకున్న దాని కన్నా ఆ చీర కాస్త ఎక్కువ ఖరీదు కావడంతో అతని పర్సు ఖాళీ అయిపోయింది.

అయినా సుధాకర్ మనసు చాలా ఆహ్లాదంగా వుంది.

రేపే తమ పెళ్ళిరోజు. ఈ చీర కట్టుకుంటే నీరజ ఎంత బావుంటుందని!

అంత ఆనందంలో నీరజ వింత మనస్తత్వం చటుక్కున గుర్తుకొచ్చింది సుధాకర్‌కి.

చీరలేకాదు కూరలైనా సరే- తను ఎంత చౌకగా తెచ్చినాసరే, బేరమాడకుండా ఎక్కువ డబ్బులు తగలేసినట్లు బాధపడుతుంది. అమైతే మరింత తక్కువ ధరకి తెచ్చేదని, తను డబ్బు తగలేస్తున్నానని వాపోతుంది. ఈ ధాటికి తట్టుకోవాలంటే చీర ధరని కొన్న ధరకన్నా తక్కువ చెప్పాలి - తప్పదు!

నిశ్చయించుకున్నాడు సుధాకర్.

అతను ఆలోచన మధ్య ఇంటికి జేరుకునేసరికి మరో అరగంట పట్టింది.

పెందలాడే వస్తాడనుకొన్న భర్త ఆలస్యమయ్యేసరికి కోపంతో మూతి ముడిచేసి బిగదీసుక్కూర్చుంది నీరజ.

ఆమెనలా చూసేసరికి అతనిలోని ఉత్సాహమంతా నీరుకారిపోయింది.

చీరతప్ప తనకి అన్యధాశరణంనాస్తి. దానితోనే భార్యని చల్లబరచాలి.

"నీరజా! ఏం తెచ్చానో చూడు." చేతిలోని పాకెట్టుని ఆమెకి అందించబోతూ అన్నాడు సుధాకర్.

అతను వూహించినట్లు ఆమె చటుక్కున పాకెట్టుని అందుకోలేదు.

"మీ కోసం రెండు గంటల నుంచీ ఎదురుచూస్తుంటే ఇప్పుడా, మీరు వచ్చేది?" కోపంగా అంది.

''ఆలస్యంగా వచ్చాను! కరెక్టే, ఆ ఆలస్యం ఈ చీరను సెలెక్ట్ చెయ్యడానికి అయ్యింది కాబట్టి, ఈ చీరని కట్టుకుని దానికి శిక్ష, నాకు కనువిందు చెయ్యి....'' చటుక్కున ఆమెచేతిని అందిపుచ్చుకుని చీర పాకెట్‌ను చేతిలో పెట్టాడు.

వెంటనే ఆ పాకెట్‌లోంచి చీరని బయటికి తీసింది నీరజ.

జరీ బోర్డరుతో కళ్ళు మిరుమిట్లు గొలిపే ఎర్రపట్టు చీర!

ఆనందంతో ఆమె కళ్ళు మెరిసాయి.

వెంటనే దాన్ని తీసి భుజాల మీదుగా వేసుకుని చూసుకుంది. ఇంతలో ఆమెకేదో గుర్తుకొచ్చింది.

''ఇంతకీ ఈ చీరని ఎంతకి కొన్నారు?'' అడిగింది భర్తని.

''అయిదు వందలు.'' వంద రూపాయలు దాని ధరలో తగ్గించి మరీ ముందు చూపుతో చెప్పాడు సుధాకర్.

నీరజ కళ్ళు చిట్లించింది. మరోసారి ఆ చీరనంతటినీ పరిశీలించింది.

''నాల్గు వందల కంటా వుండదు. మీరు వంద ఎక్కువ పెట్టారు.' ఖచ్చితంగా అంది.

సుధాకర్‌కి వళ్ళు మండింది కోపంతో. అయినా తమాయించుకున్నాడు.

''అసలు ఆరువందలు చెప్పాడు. అరగంట బేరం చేసిన తర్వాతే అయిదువందల కిచ్చాడు.''

''మరో అరగంట బేరమాడాల్సింది-నాల్గు వందలకే ఇచ్చేవాడు'' కోపంతో ఎర్రబడ్డ అతని మొహాన్ని చూసి చిన్నగా నవ్వింది ఆమె.

అంతే! అతని కోపమంతా హూష్‌కాకి!!

''అందుకే ఏదైనా కొనదల్చుకున్నప్పుడు నన్ను కూడా మీతో తీసుకువెళ్ళమంటుంటాను. మీకు తెలీదు. వినిపించుకోరు....'' ఆ చీరని భద్రంగా పట్టుకెళ్ళి బీరువాలో బంధించింది.

సర్‌ప్రయిజింగ్‌గా చీరను పట్టుకెళ్ళి భార్యను ఆనంద సాగరంలో ముంచాలన్న సుధాకర్ కోరిక కోరికగానే మిగిలిపోయింది. ఇక ఆమెతో వాదించి లాభముండదు కాబట్టి ఆ టాపిక్‌ని అంతటితో కట్ చేసేసాడు.

మర్నాడుదయం సుధాకర్ నిద్ర లేచేసరికి నీరజ ఆ గదిలో కనిపించ లేదు. స్నానం చేస్తోందేమోననుకున్నాడు. కానీ బాత్‌రూమ్‌లో కూడా అలికిడి లేదు. వంటింట్లో కూడా లేదు.

గబగబా దొడ్లోకెళ్ళాడు.

పెరట్లో వున్న గోడ మీద నుంచి పక్కింటి పార్వతమ్మతో మాట్లాడుతోంది. పార్వతమ్మ చేతిలో నిన్న తను కొనుక్కొచ్చిన చీర వుంది.

"ఈ చీర ఏడువందలు పిన్నిగారూ! పెళ్ళిరోజుకని మావారు తీసుకొచ్చారు. బావుందాండీ?'' అంటోంది నీరజ.

''చాలా బావుందమ్మా!" మెచ్చుకుంటోంది పిన్నిగారు....కానీ ఆమె కళ్ళల్లో మాత్రం అనుమానం!

నేను అయిదు వందలకి తెచ్చాను అంటేనే ఎక్కువ పెట్టానని సణిగిన నీరజ ఆమెతో ఆ చీర ఖరీదు ఏడువందలంటోంది- ఆమె ఏమను కుంటుందోనని కూడా ఆలోచించకుండా! భార్య ప్రవర్తనకి నవ్వొచ్చింది సుధాకర్‌కి.

(కలువబాల పక్షపత్రిక)